పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## గిద్దలూరు నియోజకవర్గ బీజేపీ బి ఎల్ ఏ-1గా డాక్టర్ ఆకుల నాగేష్ నియామకం

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13**

గిద్దలూరు నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బి ఎల్ ఏ-1గా డాక్టర్ ఆకుల నాగేష్ ను రాష్ట్ర కమిటీ ద్వారా నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం మార్కాపురంలో జిల్లా కలెక్టర్ విజయ సునీతను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కూడా పాల్గొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా డాక్టర్ నాగేష్ పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి తనకీ పదవి రావడానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి. వి. ఎన్. మాధవ్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు కు, ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాసరావుకు బాపట్ల జిల్లా ఇంచార్జి పులి వెంకట కృష్ణా రెడ్డి కి డాక్టర్



నాగేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రీవెన్స్ అర్జీల విషయంలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు.
అర్జీలకు త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచన.
31 శాఖల అధికారులకు గాను 8 మంది హాజరవ్వడంపై ఎమ్మెల్యే ఆగ్రహం
అర్జీదారులను పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే
అధికారులు బాధ్యతగా పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని హితవు

**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13**



గ్రీవెన్స్ అర్జీల విషయంలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రజా సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా అధికారులు పనిచేయాలని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మండల కేంద్రమైన గుడ్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత గ్రీవిన్స్ సెల్ కు హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులతో పాటు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆర్గానిక్ కూరగాయల దుకాణాన్ని పరిశీలించి, రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రీవిన్స్ సెల్ కార్యక్రమానికి మొత్తం 31 శాఖల అధికారులు పాల్గొనవలసి ఉండగా, 8 మంది మాత్రమే హాజరు కావడంపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనుంచి తప్పనిసరిగా గ్రీవెన్స్ కు అన్నీ శాఖల అధికారులు హాజరు కావాలని ఆదేశించారు. శాఖల వారీగా, గత 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న అర్జీలను నాగేశ్వరరావు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులను ప్రత్యేకంగా ఆప్యాయతతో పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే కారణంగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా వచ్చాయన్నారు. ప్రభుత్వం వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అధికారులు బాధ్యతగా పనిచేస్తూ, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని, ప్రజా అర్జీలను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నానని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగినదని ఎమ్మెల్యే ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై.వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అర్ధవీడు కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే

### పరిశుభ్రత లోపాలపై ఎమ్మెల్యే అసంతృప్తి
### మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే హెచ్చరిక
### మరోసారి పునరావృతం అయితే చర్యలు -ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 13**

మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కెజిబివి) పాఠశాలను గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వసతులను సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులు, కిచెన్ రూములు, బాత్రూములు, మరుగుదొడ్లు, వాటర్ ప్లాంట్, అలాగే నూతన గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, ముఖ్యంగా తాగునీటి అందుబాటు, ఆర్ ఓ. ప్లాంట్ పని తీరు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పరిశుభ్రత లోపాలపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదులు మరియు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఆర్ ఓ ప్లాంట్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు నిరంతరం అందించవలసిందిగా ఆదేశించారు. అలాగే, విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని, పునరావృతం అయితే చర్యలు తీసుకుంటామని, ప్రిన్సిపాల్ ను మందలించడం జరిగినది. విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ ఖాసీం పీరా , మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## ఇన్నోవా బోల్తా పలువురికి గాయాలు

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13**

గిద్దలూరు మండలం దిగువమెట్ట గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో టయోటా ఇన్నోవా కారు అదుపుతప్పి బోల్తా పడింది. పాణ్యం నుంచి గుంటూరుకు వెళుతుండగా రోడ్డు మార్జిన్ వద్ద కల్వర్టును ఢీకొట్టినట్లు సమాచారం. కారులో ఉన్న ఆరుగురు ప్రయాణికులకు గాయాలు కాగా, వారిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స జరిపిస్తున్నారు.

## ఘనంగా ఆనికాళ్లపల్లి పాఠశాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 13**

మండలంలోని ఆనికాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు జె భారతి అధ్యక్షతన భారత రాజ్యాంగ నిర్మత, న్యాయ కోవిదుడు భారతరత్న గ్రహీత బి. ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని ముందస్తుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జె భారతి విద్యార్థులతో మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం, ఆయన సాధించిన విజయాలు, సమాజానికి చేసిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని తెలిపారు కుల వివక్షను నిర్మూలించి సమానత్వాన్ని స్థాపించడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని ఆయన సూచించిన మార్గాన్ని అందరూ అనుసరించాలని అన్నారు ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు యన్.వి.ఎస్.వి అలేఖ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛ రథం'తో పర్యావరణ మార్పు

### చెత్త రహిత సమాజమే లక్ష్యం .. -ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 13**

మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం అర్ధవీడు మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామంలో పరిసరాల పరిశుభ్రత మరియు వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు అర్ధవీడు ఎంపిడిఓ కార్యాలయంలో 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ రథం కేవలం చెత్తను సేకరించే వాహనం మాత్రమే కాదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తెచ్చే ఒక వేదిక అని కొనియాడారు. ఈ పథకం యొక్క ప్రాథమిక ఉద్దేశం ప్రజలకు చెత్తపై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్, ఇనుము, కాగితం వంటి వ్యర్థాలను పారవేయకుండా, వాటిని తిరిగి ఉపయోగించుకునేలా (రీసైక్లింగ్)ప్రోత్సహించడం. "చెత్తను ఇవ్వండి – సరుకులు తీసుకోండి" అనే నినాదంతో ప్రజలను భాగస్వాములను చేయడమని నిత్యావసర సరుకులను ప్రతిఫలంగా ఇవ్వడం ద్వారా ప్రజల్లో ఉత్సాహాన్ని నింపడం అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం మరియు నిల్వ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా సేకరించడం ఈ రథం యొక్క ముఖ్య లక్ష్యమని ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం వల్ల కలిగే అపరిశుభ్రతను నివారించి, దోమల పెరుగుదల మరియు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడటం. అర్ధవిడు మండలం మరియు గ్రామీణ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాల వలె స్వచ్ఛంగా, అందంగా తీర్చిదిద్దడం తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే ఇలాంటి వినూత్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. "ప్రతి ఇల్లు స్వచ్ఛంగా ఉంటేనే, ఊరు స్వచ్ఛంగా ఉంటుంది. ఊరు స్వచ్ఛంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఈ స్వచ్ఛ రథాన్ని ప్రతి ఒక్కరూ తమ సొంత వాహనంగా భావించి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల ఎంపిడిఓ అధికారులతో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ , జడ్పిటిసి, మండల నాయకులు , స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజుపాలెంలో చిన్నారులను ప్రభుత్వ బడులలో చేర్పిద్దాం..

### బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం క్యాంపెనింగ్

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 13**

కొమరోలు మండలం రాజుపాలెం గ్రామంలో ఆ గ్రామ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు సోమవారం చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిద్దాం.. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం అని నినాదంతో పర్యటించారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను వచ్చే విద్యా సంవత్సరం లో జిల్లా పరిషత్ హై స్కూల్లో ఆరవ తరగతిలో చేర్పించాలని, అలాగే ఐదు సంవత్సరాల వయస్సు నిండిన చిన్నారులనుమండల ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు గ్రామంలో క్యాంపెనింగ్ నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నదని ,అర్హత అనుభవం గల ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన నాణ్యమైన




విద్యాబోధన అందించే ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. అంతేకాక విద్యార్థులకు స్కూలు బ్యాగులు, యూనిఫామ్లు, పాఠ్యపుస్తకాలు ,నోటు పుస్తకాలు, షూ, బెల్టు, సాక్సులు సరఫరా చేస్తున్నదని వారు వివరించారు. అంతేకాక మధ్యాహ్నం డొక్కా సీతమ్మ పథకం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం రుచి ,సుచి గల నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లుగా వారు వివరించారు. చిన్నారులను ప్రైవేటు



పాఠశాలల లో చేర్పించి అనవసరంగా డబ్బు వృధా చేసుకోవద్దని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అన్ని విధాలుగా రాణిస్తూ ,చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్,ఆ పాఠశాల ఉపాధ్యాయులు, మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖదీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, సి ఆర్ పి రామాంజి, రెండు పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి -ఎంపీడీవో



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 13**

మహిళా సాధికారతకు మరింత బలం చేకూర్చే దిశగా పుల్లల చెరువు మండల పరిషత్ కార్యాలయంలో 'నారీ శక్తీ వందన్' సదస్సు సోమవారం పుల్లల చెరువు సెక్టార్ అంగన్వాడి సూపర్వైజర్ సుబ్బమ్మ, ముటుకుల సెక్టర్ సూపర్వైజర్ దేవి బాయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అంగన్వాడి సిబ్బంది, ఆశా కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు మాట్లాడుతూ మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో భాగస్వామ్యం పెరగడం అత్యంత అవసరమని అన్నారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో మరియదాస్ మాట్లాడుతూ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఆరోగ్యం, పోషణ, విద్య వంటి కీలక రంగాల్లో మహిళల పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగిందని వివరించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని సమాజంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సదస్సులో మహిళా శక్తి ప్రాధాన్యత, బాలికల విద్య, పోషణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి అవకాశాలపై విస్తృతంగా చర్చించారు.పరస్పర సహకారంతో ముందుకు సాగాలని మహిళలు సంకల్పం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ డి.ఈ., ఎ.ఈ., అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ జమాయిల్లో అగ్నిప్రమాదం

**అప్రమత్తతతో తప్పిన ప్రమాదం.**

**మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది.**



**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 13**

మండలంలోని చిమిడితపాటు, పోట్లూరు అటవీ భూముల్లో ఉన్న జామాయిల్ చెట్లలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనె స్పందించిన ఫారెస్ట్, రెవిన్యూ సిబ్బంది సమాచారం అగ్నిమాపక సిబ్బందికి చేరవేయడంతో హుటాహుటిన సంఘటన స్టలికి చేరుకున్న వారు మంటలను అదుపులోనికి తీసుకువచ్చారు. దీనితో పెద్ద ప్రమాదం తప్పినట్టు అయినది. ఈ ప్రమాదంలో సుమారు 5 ఎకరాల మేర జామాయిల్ మొక్కలలో నష్టం చేకూరింది. ప్రతి సంవత్సరం ఈ ఫారెస్ట్ ప్రాంతంలో ఏదో ఒకచోట ఇలా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనిపై ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, అగ్నిప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

***మెప్మో ఆర్పి యూనియన్***



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13**

గిద్దలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మెప్మో ఆర్పి యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి గిద్దలూరు మున్సిపల్ కమిషనర్ ఏవి రమణ బాబు కు ఎప్మా సీ ఓ ఎస్.కె సుభాను వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెప్పు ఆర్పీ యూనియన్ అధ్యక్షురాలు పి సాయి లక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి డి రుతమ్మ మాట్లాడుతూ గత నాలుగు నెల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఆర్పీలందరికీ 10 లక్షల రూపాయల గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలని, గ్రేడింగ్ విధానం రద్దుచేసి కనీస వేతనం చెల్లించాలని, 2019 నుండి రిజిస్ట్రేషన్ అయిన ఆర్పీలకు లాగిన్ ఇవ్వాలని, స్వయం సహాయ, అభయ హస్తం, పొదుపు మహిళలకు తిరిగి చెల్లించాలని, మొబైల్ లాగిన్ బాధ్యత ఆర్పి లకు ఇవ్వాలని, పొదుపు మహిళలకు 10 లక్షల బీమా విధివిధానాలను ప్రకటించాలని, పొదుపు మహిళలకు 10 లక్షల వరకు వడ్డీ రాయితీలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్పీలకు ఇచ్చే నెల గౌరవేతనాన్ని ఆర్పి అకౌంట్లో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పి యూనియన్ నాయకులు వై రాధాదేవి, కె విమలమ్మ, ఎస్.కె గౌసీయా, ఎస్.కె కరిమునిషా, పి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# భారత దేశ క్షేమము కొరకు ప్రార్థించిన మార్కాపురం జిల్లా దైవ సేవకులు





**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 13**

మండల కేంద్రంలోని జిల్లా మండల పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మంత్లీ మీటింగ్ హెబ్రోన్ ప్రార్థన మందిరము త్రిపురాంతకం లో జిల్లా అసోసియేషన్ ఎర్రగొండపాలెం కన్వీనర్ బిషప్ పి జే డగ్లస్ ఆధ్వర్యంలో దేవునికి మహిమకరంగా జరిగింది. ముఖ్య అతిథిగా తెనాలి ప్రాంతము నుంచి విచ్చేసిన ఈరే మినిస్ట్రీస్ ప్రెసిడెంట్ బిషప్ కత్తెర సుధీర్ కుమార్ దైవ సందేశం అందిస్తూ సమాజములో అనేక ప్రాంతాలలో క్రైస్తవుల పట్ల జరుగుచున్న దాడులను బట్టి పాముల వలే వివేకము కలిగి పావురము వలే నిష్కపటులై యుండి అనేక ఆత్మలను రక్షించి భారత దేశ ప్రజలను పరలోక రాజ్యము చేర్చులాగున దైవసేవకులందరూ బోధిస్తూ మరియు దేశ క్షేమము కొరకు ప్రార్థించాలని ఉపదేశించడం జరిగింది. మార్కాపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ నందిగం ఫ్రాంక్లిన్ ఎఫ్రాయిమ్ మాట్లాడుతూ దైవ సేవకులు అందరు ఐక్యత , ప్రేమ కలిగి , క్రీస్తు అడుగుజాడల్లో నడుస్తూ, అప్పగించిన పరిచర్య లో నమ్మకస్తులుగా ఉండాలని ప్రబోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రెవరెండ్ డాక్టర్ పులుకూరి ఆంద్రూస్, ట్రెజరర్ రెవరెండ్ ఓత్నీయేల్ మోజస్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మరియు దోర్నాల మండల పాస్టర్స్ మరియు ఇవాంజెలిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బుట్టి పాల్ స్పర్జన్,ఎర్రగొండపాలెం నియోజకవర్గ పాస్టర్స్ యూనియన్ అధ్యక్షులు చేదురి లక్ష్మయ్య, ఎర్రగొండపాలెం మండల పాస్టర్స్ యూనియన్ సెక్రటరీ కొర్రప్రోలు మరియు బాబు, పాస్టర్ సింగా ఏసన్న, రెవరెండ్ బొప్పూరి ప్రభుదాస్, పాస్టర్ చెన్నయ్య, బరిగల జాన్ ప్రసాద్ రావు మరియు నాలుగు నియోజక వర్గముల నుంచి జిల్లా కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు అందరూ మద్దతు పలకాలి

***రాష్ట్ర బిజెపి మహిళా నేత బెల్లంకొండ విజయలక్ష్మి***



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 12**

ఈనెల 16న మూడు రోజులపాటు జరిగే పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్టీలతో సంబంధం లేకుండా అందరూ మద్దతు పలకాలని రాష్ట్ర బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి కోరారు. సోమవారం నాడు ఆమె పొదిలి ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు అందరూ మద్దతు ఇవ్వాలని ఆమె కోరారు. మన దేశ జనాభాలో 50 శాతం కు పైన మహిళలు ఉన్నప్పటికీ ప్రస్తుతం పార్లమెంటులో కేవలం 14 శాతం మాత్రమే మహిళా సభ్యులు ఉన్నారని ఆమె వివరించారు. గతంలో మాజీ ప్రధానమంత్రి దేవగౌడ హయాంలో ఒకసారి, 2023 సంవత్సరంలో పార్లమెంటులో మరోసారి మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ అప్పటి రాజకీయ పార్టీల సరైన మద్దతు లేక ఆమోదం పొందలేదని విజయలక్ష్మి చెప్పారు. ఈనెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరుగు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో 33% మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడం జరుగుతుందని, పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులు చారిత్రాత్మకమైన మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇచ్చి ఆమోదించాలని ఆమె కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లు భారత ప్రధాని నరేంద్ర మోడీ చిరకాల స్వప్నముగా విజయలక్ష్మి అభివర్ణించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడుతున్న ప్రధాని నరేంద్ర మోడీకి పార్టీలకు అతీతంగా పార్లమెంటు సభ్యులు మద్దతు పలకాలని విజయలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఏఎంసి డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది ఇనగంటి శైలజ, ఏఎంసి డైరెక్టర్ పువ్వాడ నారాయణమ్మ, టిడిపి నాయకురాలు, లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్ అధినేత వరి కోటి శిరీష, నేలటూరి శైలజ, మాజీ ఏఎంసి డైరెక్టర్ కిరణ్మయి, బిట్స్ కాలేజీ అధ్యాపకురాలు షేక్ హమీదా, బిజెపి జిల్లా మైనారిటీ మోర్చా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాదర్ భాష, బిజెపి సీనియర్ నాయకులు మాగులూరు రామయ్య, స్థానిక శివాలయం కమిటీ డైరెక్టర్ ఎన్ నాగేశ్వరరావు, షేక్ చిన్న భాష, జి భార్గవ నాయుడు, డి . నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపూడిలో పోషణ పక్వాడ పట్ల సదస్సు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 12**

మండల కేంద్రమైన మర్రిపూడి లో పోషణ పక్వాడా పై అవగాహన సదస్సు జరిగింది. మర్రిపూడి ఎస్సి అంగన్వాడీ కేంద్రంలో సోమవారం నాడు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అంగన్ వాడి కార్యకర్తలు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చేయవద్దని తల్లులకు సూచించారు. అలాగే ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు జంక్ ఫుడ్ ఆహార పదార్థాలపై కూడా అవగాహన కల్పించారు. అలాగే గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఆహార వంటకాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలకు సెల్ ఫోన్ లను దూరంగా ఉంచాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు కెపి హైమావతి, సుధేష్ణ, కామేశ్వరి, వెంకట నరసమ్మ, కేజీ యమ్మ, ఏ ఎన్ ఎం పుణ్యవతి, ఆశా వర్కర్ రజిత, అంగన్వాడి ఆయా దిబోర తోపాటు తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీ

**పచ్చ జెండా ఊపిన ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల**





**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 13**

మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రై సైకిల్స్ మరియు డస్ట్ బిన్ల పంపిణీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని పచ్చ జెండా ఊపి ట్రై సైకిల్స్ మరియు డస్ట్ బిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. మన అర్ధవీడు మండలానికి 17 రిక్షాలు, గ్రీన్ అంబాసిడరెస్ అయిన మీరు మీకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ప్రతి ఒక్కరూ 250 గృహాల నుండి చెత్త సేకరించి పరిశుభ్రం గా ఉంచడంలో మీది ముఖ్య పాత్ర పోషిస్తున్నారు కావున గ్రామాలు, పట్టణాలు శుభ్రంగా ఉండేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ట్రై సైకిల్స్, డస్ట్ బిన్ల పంపిణీతో చెత్త సేకరణ వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని కూటమి ప్రభుత్వం అభివృద్ధి లో ముందు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, సిబ్బంది మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి ఆటో బోల్తా- మహిళ మృతి



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 13**

డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో మదవపల్లె గ్రామానికి చెందిన మూరం సుబ్బమ్మ(55) అనే మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం కొమరోలు మండలం ఎడమకలు క్రాస్ రోడ్డు సమీపంలో జరిగింది. కొమరోలు మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీలోని మధవ పల్లె గ్రామానికి చెందిన మూరం సుబ్బమ్మ తన కుమారుడు తో కలిసి సోమవారం ఉదయం ఒంగోలు కు వెళ్లి అక్కడ వైద్యశాలలో చికిత్సలు చేయించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. తల్లి కుమారుడు ఒంగోలు నుంచి గిద్దలూరు కు వెళ్లే బస్సులో బయలుదేరి కొమరోలు మండలం తాటిచెర్ల మోటు వద్ద బస్సు దిగారు. అక్కడ కొమరోలుకు వచ్చే ఆటో సిద్ధంగా ఉండటంతో తోటి ప్రయాణికులతో పాటు సుబ్బమ్మ ఆమె కుమారుడు కూడా ఆటో ఎక్కారు సుబ్బమ్మ ఆటోలో వైపు కూర్చోగా ఆమె కుమారుడు డ్రైవర్ సీటు పక్కన కూర్చున్నాడు. అయితే ఆటో డ్రైవర్ సెల్ఫోన్లో మాట్లాడుతూ ఉండగా ఎడమ కళ్ళు క్రాస్ రోడ్డు సమీపంలోని మలుపు వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డు మార్జిన్ లో ఉన్న మట్టి దిబ్బలపైకి ఆటో వెళ్ళిందని ఆటో ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులు తెలిపారు. దీనితో ఆటో బోల్తాపడడంతో ఒక వైపున కూర్చుని ఉన్న సుబ్బమ్మ కింద పడింది. ఆమెపై ఆటోతోపాటు ఆటోలో కూర్చుని ఉన్న ప్రయాణికులు కూడా పడటంతో సుబ్బమ్మకు ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందిందని ప్రయాణికులు చెప్పారు. కాగా ఆటోలో ఉన్న ప్రయాణికులలో మరి కొంతమందికి గాయాలైనట్లుగా వారు తెలిపారు. సమాచారం అందుకున్న కొమరోలు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతిచెందిన సుబ్బమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు ఆంజనేయ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా కొమరోలు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతురాలు సుబ్బమ్మ భర్త మాజీ సైనికుడు గతంలో మృతి చెంది ఉండగా, సుబ్బమ్మకు ప్రస్తుతం కుమారుడు ఆర్మీ జవాన్ ఆంజనేయ రెడ్డి తో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# అక్రమ విద్యుత్ వినియోగిస్తే చర్యలు తప్పవు

**విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హైమావతి**



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 13**

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి హైమావతి హెచ్చరించారు మండలంలో అక్రమ విద్యుత్ వినియోగాన్ని అరికట్టేందుకు విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో సోమవారం అక్రమ విద్యుత్ వినియోగదారులపై దాడులు నిర్వహించారు విజిలెన్స్ అధికారులు 25 బృందాలుగా విభజించుకుని మండలవ్యాప్తంగా సమగ్ర తనిఖీలు చేపట్టారు. గ్రామాలు, వ్యవసాయ కనెక్షన్లు, గృహాలు, వాణిజ్య స్థాపనలు వంటి అన్ని విభాగాల్లో అక్రమ వినియోగంపై దృష్టి సారించారు. మొత్తం 1042 విద్యుత్ సర్వీసులను పరిశీలించిన అధికారులు, అందులో 48 సర్వీసులలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు.ఈ నేపథ్యంలో సంబంధిత వినియోగదారులపై మొత్తం రూ. 2,16,000 జరిమానా విధించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ కనిగిరి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమాకాంత్, పామూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు యుగంధర్, ఏ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఏఈ లు వెంకటేశ్వర్లు, కె కోటయ్య, మండల విద్యుత్ శాఖ అధికారి ఎల్ రమేష్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# మేదరమెట్లలో ముగిసిన నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ సమరం





**అద్దంకి ఆర్.సి (పెన్ పవర్), ఏప్రిల్ 13**

ప్రకాశం జిల్లా, కొరిశపాడు మండలం, మేదరమెట్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన నియోజకవర్గ స్థాయి డబుల్ బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న ఈ క్రీడా సంబరాలు చివరి రోజున పోటాపోటీగా సాగి ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 50 జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాయి.

**ఆకట్టుకున్న ఫైనల్ పోరు...**

ఫైనల్ మ్యాచ్‌లో క్రీడాకారులు పాయింట్ పాయింట్ కు తీవ్రంగా శ్రమించారు. తుది సమరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మేదరమెట్లకు చెందిన అభిరామ్-శ్రీనివాస్ జోడీ ప్రథమ బహుమతితో పాటు రూ. 10,116 నగదును సొంతం చేసుకుంది. పంగులూరుకు చెందిన సందీప్-వలి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 7,116 బహుమతిని గెలుచుకోగా, అద్దంకికి చెందిన బాషా-కాజా జట్టు తృతీయ బహుమతిని (రూ. 5,116), నాగేశ్వరరావు-గురుభక్త జట్టు నాల్గవ బహుమతిని (రూ. 3,116) దక్కించుకున్నారు. టోర్నమెంట్ ఆద్యంతం అద్భుతమైన ప్రదర్శన చేసిన అభిరామ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు లభించింది. ?ముగింపు వేడుకల్లో భాగంగా అంబేద్కర్ యూత్ సభ్యులు మాట్లాడుతూ.. క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం చేకూరుతుందని, యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం యువకులు ప్రజలకు అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసి, జై భీమ్ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బోనిగల. అంజయ్య, జ్యోతి. రమేష్, బొనిగల. శ్రీనివాసరావు, పేరం. నాగరాజు, దామవరపు. ప్రసాద్, బోనిగల. మధు, మేడికొండ. రామారావు, గుడిమెట్ల. రాజు, అనిల్, మోషే, అఖిల్, అంబేద్కర్ యూత్ సభ్యులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడు గ్రామంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహణ



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 13**

మండలంలోని ఉప్పలపాడు ప్రభుత్వ పాఠశాల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో ఐదు సంవత్సరాలు నిండిన చిన్నారుల కోసం ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు షేక్ నాయబ్ రసూల్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫారాలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎలికా శ్రీనివాసులు, షేక్ వహీద్ పాల్గొని గ్రామస్తులతో ప్రత్యక్షంగా మాట్లాడి, విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌కు గ్రామస్తులు మంచి స్పందన చూపినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. హాబిడేషన్ పరిధిలో ఐదు సంవత్సరాల నిండిన విద్యార్థినీ విద్యార్థుల వివరాలు సేకరించడం జరిగింది.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే!

### పొదిలి ఎస్ ఐ రాజేష్



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 12**

వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని వదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ ఎస్. రాజేష్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆయన పట్టణంలోని పెద్ద బస్టాండు సెంటర్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులతో మాట్లాడి పలు సలహాలు సూచనలు అందించారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను సక్రమంగా పాటిస్తూ, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ ఐ రాజేష్ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్ ఐ రాజేష్ స్పష్టం చేశారు. అలాగే మైనర్లు వాహనాలు నడపడం పట్ల కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అటువంటి వాటిపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ రాజేష్ హెచ్చరించారు. తల్లితండ్రులు మైనర్ లైన తమ పిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇవ్వవద్దని ఎస్ ఐ సూచించారు. రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, రోడ్డు నియమ నిబంధనలను పాటించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యతగా ఎస్ ఐ రాజేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ తో పాటు పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 1,13,365/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 13**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ. 1,13,365/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా ఆదాయం రూ. 52,430/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా ఆదాయం రూ. 22,570/- లు, శాశ్వత అన్నదానం నకు విరాళంల ద్వారా ఆదాయం రూ,20,849/- లు , స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .5,516/- లు , ఇతర విరాళముల ద్వారా ఆదాయం రూ. 12,000 /- లు వచ్చినట్లు తెలిపారు.

## ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఆవులయ్య






**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 13**

సిఎస్పురం ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక నారాయణస్వామి కాంప్లెక్స్ నందు జిలకర వెంకటనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఆవులయ్య మాట్లాడుతూ వ్యవసాయంలో లాభసాటి ఆదాయం రాకపోవడంతో చాలామంది యువత ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్ జీవనం కొనసాగిస్తున్నారని,రాష్ట్ర ప్రభుత్వం అనేక రకాల ఆటో రంగంపై ట్యాక్స్ వేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయటం లేదని అన్నారు ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఆ సంక్షేమ బోర్డు ద్వారా 60 సంవత్సరాలు నిండిన ఆటో కార్మికుడికి పెన్షన్, ప్రమాద బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని,ఉచిత ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం కాపాడాల్సింది పోయి చలానాల పేరుతోటి ఆటో కార్మికులపై విపరీతమైన ఫైన్లు రాస్తున్నారని అన్నారు. ఆటో కార్మికులపై వేస్తున్న ఫైన్ రద్దు చేయాలని ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండయ్య మాట్లాడుతూ మండలంలో ఉన్న ఆటో కార్మికులందరూ సంఘటితంగా ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటం చేయాలని,ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఆటో వర్కర్స్ యూనియన్ మండల కన్వీనర్ గా జిలకర వెంకటనారాయణను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. సమావేశంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13**

గిద్దలూరు పట్టణంలో ఏబీఎం పాలెం ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆది ఆంధ్ర)కు ప్రహరీ గోడ నిర్మాణ పనులను శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాఠశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రహరీ గోడ నిర్మాణానికి సమగ్ర శిక్ష ఏపిడబ్ల్యూ నిధుల ద్వారా రూ. 9.37 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు, పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లను బాలబాలికలు వినియోగించుకునేలా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. పాఠశాలకు పూర్తిస్థాయి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కూడా మండల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఎన్. అశ్వనీ కుమార్, పి. నాగభూషణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీ రమణ బాబు, ఏ ఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులుగా జడ్పిటిసి శ్రీ బుడద మధుసూదన్ యాదవ్, శ్రీ సాయి రామచంద్ర రెడ్డి, బి. చంద్రశేఖర్ యాదవ్, లోక్కు రమేష్, పి. చిన్న శ్రీనివాసరెడ్డి, పి రజిని కుమార్ తదితరులు హాజరయ్యారు. కాంట్రాక్టర్లు కృష్ణారెడ్డ రమణయ్యలకు ప్రహరీ గోడ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

## రామచంద్ర యాదవ్ బీసీ ధర్మ దీక్షకు సంఘీభావం తెలిపిన గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంఘాలు -గిద్దలూరు : గత

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13**




ఏప్రిల్ 11 నుండి బీసీ లకు మద్దతుగా 5 డిమాండ్లు నెరవేర్చాలని మంగళగిరి వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న బోడే రామచంద్ర యాదవ్ కు సోమవారం రాజకీయ పార్టీలకు అతీతంగా గిద్దలూరు నియోజకవర్గ బీసీ సంఘాలు మద్దతు పలికాయి. గిద్దలూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ సమావేశం లో కంచర్ల కోటయ్య గౌడ్ మాట్లాడుతూ బోడే రామచంద్ర యాదవ్ చెప్పిన 5 డిమాండ్లను బీసీ రక్షణ చట్టం అమలు, రాజధాని ప్రాంతం లో బీసీ లకు 1000 ఎకరాల భూ కేటాయింపు, బీసీ కులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయింపు, సమగ్ర కుల గణన మరియు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్ట సభలలో బీసీ లకు 44 శాతం రిజర్వేషన్ లు ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీసీ ల ఎన్డిఏ కూటమి ప్రభుత్వం వెంటనే ఈ డిమాండ్లు నెరవేర్చి బీసీల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. కటారు రాజా అరుణ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ కోసం పార్లమెంట్లో ప్రవేశపెట్టబోయే మహిళా బిల్లులో బీసీ మహిళలకు వాటా కల్పించే విధంగా ఎన్డిఏ కూటమి ప్రభుత్వం కృషి చేయాలని రామచంద్ర యాదవ్ బీసీ ల కోసం డిమాండ్ చేస్తున్న 5 డిమాండ్లు గతంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలే నని, ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు అమలు పరచలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు తొండమల్ల బ్రహ్మయ్య, కేవి స్వామి కొండయ్య, తూర్పునాటి గోపాల్, పాలకవీటి బాల చెన్నయ్య, రామయ్య, కొప్పుల నరసింహులు, మేదర శ్రీను స్వామి గుండం గౌడ్, కొత్తకోట పెద్దిరాజు, చెన్నబోయిన రామకృష్ణ, పులుసు రామకృష్ణ, పందరబోయిన గంగయ్య, బట్టపోతుల రాజయ్య, మేకల బయన్న ఇంకా భారీగా బీసీలు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడ పోస్టర్ ఆవిష్కరణ



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్13**

గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో పోస్టర్లను అధికారికంగా ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం అత్యంత ముఖ్యమని, జింక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, అధిక చక్కెర (షుగర్) ఉన్న ఆహారాలను దూరంగా ఉంచాలని సూచించారు. అదేవిధంగా టీవీ, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌ల వంటి డిజిటల్ పరికరాల వినియోగాన్ని పిల్లలలో నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పుట్టిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలలో పిల్లల మెదడు అభివృద్ధి సుమారు 80 శాతం వరకు జరుగుతుందని, ఈ దశలో శారీరక, భావోద్వేగ, సామాజిక, జ్ఞాన సంబంధ (కాగ్నిటివ్) , సృజనాత్మక అభివృద్ధి వేగంగా జరుగుతుందని వివరించారు. పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం తల్లి దండ్రులు వారితో సమయం కేటాయించడం అత్యంత అవసరమని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కె. మహిత, సూపర్వైజర్ శ్రీమతి బి. జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల





**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 13**

మార్కాపురం జిల్లా అర్ధవీడు మండలం అర్ధవీడు గ్రామంలో బస్ స్టాప్ వద్ద అధికారులు, మరియు స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన చలి వేంద్రంను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉన్నాయని ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న సందర్భంగా దూర ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు , స్థానికులు దాహార్తికి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం పేదవారికి సేవలు అందించాలని మంచి ఉద్దేశంతో బస్ స్టాండ్ ఆవరణ లో మంచినీటి చలివేంద్రం ప్రారంభించి అందరికీ అందుబాటులో తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్ధవీడు మండల ఎంపిడిఓ అధికారులతో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ , జడ్ పిటిసి, మండల నాయకులు , స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు చలివేంద్రం ప్రారంభోత్సవం లో పాల్గొన్నారు.

## గిద్దలూరు తాలూకా నూతన జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసి) ఎన్నిక



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 13**

గిద్దలూరు పట్టణంలోని ఎన్జీవో హోం లో సోమవారం సాయంత్రం 5 గంటలకు జేఏసీ నూతన కమిటీ ఎన్నిక కోసం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశంలో గిద్దలూరు తాలూకా జేఏసీ చైర్మన్ గా టి. నరేష్ బాబు, కో చైర్మన్ కమ్ వైస్ చైర్మన్ గా డాక్టర్ మొర్రి.పిచ్చయ్య, సెక్రటరీ జనరల్ గా యం.కాశీ రమణ , ఉపాధ్యక్షులు గా డి.వి. పిచ్చయ్య, టి. సుబ్బరాయుడు, బి.రాజ గోపాల్ రెడ్డి, జే.యం.శివ ప్రసాదు లను, జాయింట్ సెక్రటరీలుగా డి.పుల్లయ్య, పి.నాగేశ్వరరావు, యన్. రామకృష్ణ లను, ట్రెజరర్ గా యన్. సాయి ప్రసాద్, సభ్యులుగా జి .బాల వెంకటేశ్వర్లు, పి. రంగారెడ్డి, పాశం. ప్రసాద్, యస్.వెంకట శేషు కుమార్, యస్. రంగస్వామి, పి.ఎస్. నాయక్, యన్.ఆర్. చంద్ర మోహన్, బి. రమేష్ బాబు, చంద్రమోహన్,బి.నాగార్జున లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. వీరు మూడు సంవత్సరాల పాటు కమిటీ బాధ్యులుగా కొనసాగుతారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్యకలాపాలు చేయవలసి ఉంతుందని,. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను పలు సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్. తోయక జగదీశ్వరి.



**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 13 పెన్ పవర్.** పేద ప్రజలు ఆపదలో ఉంటే నేనున్నాను అని ఆదుకోవడం ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఒ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి అన్నారు.గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం పరిధిలోని సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు సోమవారం నాడు ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి చెక్కును పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నిధులు అందించడం జరుగుతుందని అన్నారు.కురుపాం మండలానికి చెందిన బియ్యలవలస గ్రామానికి చెందిన పాలక సుందరరావు కు 30786 మరియు కిచ్చాడ గ్రామానికి చెందిన పద్మనాదం సుస్మిత కు 23,400మరియు కురుపాం గ్రామానికి చెందిన కర్రి సత్యంనాయుడు కు 52,522 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.చెక్కు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి కి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కె.వి.కొండయ్య,మాజీ ఏఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్,కురుపాం పిఏసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్,నాయకులు కడాయి,రామకృష్ణ,శ్రీను,సుబ్బలక్ష్మి,రంగారావు,మాసయ్య,కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగువాడ లో 'పిఎం సూర్య ఘర్' పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గౌతు శిరీష....



**పలాస మండలం, పెన్ పవర్ :13:**పలాస మండలం గంగువాడ గ్రామంలో ఎమ్మెల్యే గౌతు శిరీష కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం "పిఎం సూర్య ఘర్: ఉచిత విద్యుత్ యోజన"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

రాష,ర్ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చని, దీనివల్ల సామాన్యులపై విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని ఆమె వివరించారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పొదిలిలో వెలుగు వివోఏల ప్రదర్శన

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 12**

పొదిలిలో వెలుగు వివో ఏ యానిమేటర్ ఉద్యోగులు ప్రదర్శన జరిపారు. సోమవారం నాడు ఆయా ఉద్యోగులు తమ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ప్రదర్శనగా మండల రెవెన్యూ కార్యాలయం వరకు వెళ్లి అక్కడ కొద్దిసేపు ధర్నా జరిపారు. ఈ సందర్భంగా వివోఏ ల సంఘం మండల కార్యదర్శి దాసరి మహేష్ మాట్లాడుతూ తమకు కనీస వేతనాలు చెల్లించాలని, హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే రెండు సంవత్సరాల శ్రీనిధి ఇన్ సెంట్, మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. అలాగే సెల్ ఫోన్స్ సి యు జి సిమ్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కూడా కల్పించాలని ఆయన కోరారు. 10 లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పించాలని, అలాగే 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని మహేష్ డిమాండ్ చేశారు. సిఐటియు మార్కాపురం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో వి ఓ ఏ ల అక్రమ తొలగింపులు, వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. వెలుగు యానిమేటర్ ఉద్యోగుల సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఏప్రిల్ 27వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద పొదుపు మహిళలతో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం తమ సమస్యల గురించి వినతి పత్రాన్ని మండల డిప్యూటీ తహసిల్దార్ సాజిదా కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, పులి మండల అధ్యక్షురాలు పి నాగమల్లేశ్వరి, ఇందిరమ్మ , సుబ్బారావు, రమణమ్మ, రమాదేవి, సుభాషిని, అరుణ, ఖాసింబి, పద్మ , హైమావతి తోపాటు డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నేరేడి బ్యారేజీ నిర్మాణం.. చరిత్రలో నిలిచిపోయే ఘట్టం!





- రాష్ట్ర వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- దివంగత నేత ఎర్రన్నాయుడు ఆశయం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ఏడాదిన్నరలో పూర్తి.. రూ.60 కోట్ల మంజూరుకు సి.ఎం. సానుకూలత
- జిల్లా రైతాంగం కల సాకారం

**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 13 :** ఉత్తరాంధ్ర రైతాంగ దశాబ్దాల కల నేరేడి బ్యారేజీ నిర్మాణం చరిత్రలో నిలిచిపోయేలా సాకారం కాబోతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సుమారు 50 ఏళ్ల ఆరాటానికి ఎట్టకేలకు మోక్షం లభించిందని, కేవలం ఏడాదిన్నర కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని ఆయన తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో నందిగాం మండల నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పలు కీలక అంశాలను వెల్లడించారు.

**ఎర్రన్నాయుడు ఆశయం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం**

నేరేడి బ్యారేజీ నిర్మాణం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు కల అని, ఆ ఆశయాన్ని నెరవేర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని అచ్చెన్నాయుడు భావోద్వేగంతో తెలిపారు. నేరేడి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం ఒక చారిత్రాత్మక విజయం. ఇందుకోసం తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర పెద్దలతో నిరంతరాయంగా సంప్రదింపులు జరిపామన్నారు. ఆ కృషి ఫలితంగానే నేడు సమస్య పరిష్కార దిశగా అడుగులు పడ్డాయని తెలిపారు. ప్రాజెక్టు పనుల కోసం ప్రాథమికంగా రూ.60 కోట్ల మంజూరుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

**వైకాపా హయాంలో ప్రాజెక్టులు నిర్వీర్యం**

గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని మంత్రి మండిపడ్డారు. 2010లో ట్రిబ్యునల్ ఏర్పాటుతో పరిష్కారం మొదలైతే, 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం చేశారని గుర్తు చేశారు. 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం కనీస ప్రయత్నం కూడా చేయకుండా జిల్లా ప్రయోజనాలను పక్కన పెట్టిందని విమర్శించారు.ప్రతిష్టాత్మకమైన ఆఫ్‌షోర్ ప్రాజెక్టుకు గతంలో రూ.450 కోట్లు మంజూరై పనులు శరవేగంగా సాగాయని, కానీ గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పట్టించుకోకుండా గాలికొదిలేసిందని ఆరోపించారు.

సాగునీటి రంగానికి కూటమి ప్రభుత్వం అగ్రతాంబూలం ఇస్తోందని మంత్రి అన్నారు. నేరేడితో పాటు ఆఫ్‌షోర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలో ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే, జిల్లా రైతాంగం ఏడాదికి రెండు మూడు పంటలు పండించుకునే వెసులుబాటు కలుగుతుందని, శ్రీకాకుళం జిల్లా అన్నపూర్ణగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్ ,తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశాఖలో వివాహితపై భర్త దారుణ దాడి ఐసీయూలో చికిత్స



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 13 :** నగరంలో ఓ వివాహితపై ఆమె భర్త కిరాతకంగా దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. తీవ్ర గాయాలతో బాధితురాలు ప్రస్తుతం కింగ్ జార్జ్ హాస్పిటల్ లో ఐసీయూలో చికిత్స పొందుతోం ది.వివరాల్లోకి వెళితే... విశాఖలోని ఆర్ ఒ బి జంక్షన్ సమీపంలోని భీమ్‌నగర్ ప్రాంతానికి చెం దిన శ్రీవాణి (పేరు మార్పిడి) అనే మహిళపై ఆమె భర్త కొల్లి రామనాయుడు దాడి చేసినట్లు సమాచారం. 2021లో వీరి వివాహం జరిగి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొంత కాలంగా కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త తరచూ వేధింపులకు గురి చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఇటీవల రాత్రి ఇంటికి వ చ్చిన భర్త, చిన్న విషయాన్ని కారణంగా చూపు తూ బెల్ట్‌తో దారుణంగా కొట్టడంతో పాటు గొంతుపై కాలితో నొక్కి తీవ్రంగా హింసించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్ర గాయాలపాలైన శ్రీవాణిని కుటుంబ సభ్యులు మొదట స్థానిక ఆసుపత్రులకు, అనంతరం పరిస్థితి విషమిం చడంతో కేజీహెచ్‌కు తరలించారు.బాధితురాలి పరిస్థితి గురించి తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు సోమవారం కేజీహెచ్‌లో ఆమెను పరామర్శించారు. రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ, విశాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి తదితరులు వైద్యులతో మాట్లా డి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. బాధి తురాలికి మెరుగైన వైద్యం అందించాలని వారు వైద్యులను కోరారు.అనంతరం వారు నగర పోలీస్ కమిషనర్‌ను కలిసి ఘటన వివరాలు తెలియజేసి, నిందితుడిపై కఠిన చర్యలు తీసు కోవాలని ఫిర్యాదు చేశారు. మహిళలపై పెరుగు తున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేసిన వారు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

బాధిత మహిళకు పార్టీ తరపున అన్ని విధాలు గా అండగా ఉంటామని నాయకులు హామీ ఇ చ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

# సింహాచలం చందనోత్సవం భక్తులకు సజావుగా దర్శనం కల్పించాలి

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు





**భిమిలి, పెన్ పవర్, ఏప్రిల్ 13 :** చందనోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువం టి ఇబ్బందులు లేకుండా సజావుగా నిజరూప దర్శనం కల్పించాలని భీమిలి ఎమ్మెల్యే అధికా రులకు సూచించారు. సోమవారం ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయా లని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.

గత ఏడాది జరిగిన అపశృతులు పునరావృతం కాకుండా మంత్రుల కమిటీ ప్రత్యేకంగా పర్యవేక్ష ణ చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సాధారణ రోజులతో పోల్చితే చందనోత్సవం, గిరి ప్రదక్షిణ రోజుల్లో భక్తుల రద్దీ కనీసం పది రెట్లు అధికంగా ఉంటుందని, ఆ మేరకు సౌకర్యాలు కల్పించడం పెద్ద సవాల్‌గా మారిందన్నారు.ఈసారి పూర్తిస్థా యి ఈఓ బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉత్సవం మరింత సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశా రు. దర్శనానికి వచ్చే భక్తులు దేవస్థానం నిర్దేశిం చిన స్లాట్‌లు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ఏప్రిల్ 20న జరగనున్న చందనోత్సవానికి సంబంధించి క్యూ లైన్లు, తాగునీటి వసతులు, రవాణా, పార్కింగ్, ప్రసాదాల పంపిణీ వంటి అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈఓ జె. వెంకట్రావు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టికెట్ల జారీ విధానం, స్లాట్ వివరాలను వివరించారు.

చందనం అరగదీత ప్రారంభం

చందనోత్సవం సందర్భంగా ఆలయంలో సంప్ర దాయ ప్రకారం చందనం అరగదీత కార్యక్రమా న్ని గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. స్వా మివారిని దర్శించుకున్న అనంతరం గంధపు చెక్కను స్వయంగా అరగదీశారు. సంవత్సర మంతా చందనంతో కప్పబడి ఉండే నృసింహ స్వామి, చందనోత్సవం రోజున మాత్రమే నిజ రూప దర్శనం ఇస్తారని ఆలయ వర్గాలు పేర్కొ న్నాయి. ఉత్సవం అనంతరం స్వామివారిని మళ్లీ చందనంతో అలంకరించేందుకు ఈ గంధం సిద్ధం చేస్తారు.

ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకు లు, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకు లు పాల్గొన్నారు.

# భారమోసి పంచాయతీలో పలు సమస్యలపై ఏంపిడిఓ కు వినతిపత్రం అంధిచిన పరదాని సురేష్

## మండల స్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో సిసి రోడ్డులకు హామీ.



**హుకుంపేట పెన్ పవర్ ఏప్రిల్ 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాల మేరకు అరకు నియోజవర్గం హుకుంపేట మండలం తేదీ 13 04 2026 తేదీన హుకుంపేట మండల స్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ కార్యనిర్వాహన కమిటీ సభ్యులు పరదాని సురేష్ బారామసి పంచాయతీలో పలు సమస్యలు బారాపల్లి పెంకిటి కాలనీ నుండి గడ్డి కాలనీ వరకు సిసి రోడ్డు కొరకు అర్జీ పెట్టడం జరిగింది అలాగే స్మశాన వాటిక వెళ్లే రహదారి సీసీ రోడ్డు గురించి కూడా అర్జీ సమర్పించారు మరియు గ్రామం లో వున్నా పాఠశాల ప్రహరీ గోడ వంటి సమస్యల గూర్చి అర్జీలు అందచేశారు మండల స్థాయి పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో హుకుంపేట ఎంపీడీవో రమాదేవి తమ పంచాయతీ సమస్యలు సంబంధిత అధికారులు అన్ని శాఖల అధికారులు తెలియజెస్తాం అందుకు ఎంపీడీవో రమాదేవి తప్పనిసరిగా గ్రాండ్ చేస్తామని మాట ఇచ్చారు.దింతో అయన సంతోషం వ్యక్తపరిచారు.

# ఘనంగా మోదకొండమ్మ అమ్మవారి పందిరి రాట - ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో ప్రారంభం.



- మే 10, 11, 12 తేదీల్లో మహోత్సవాలు;
- సతకంపట్టు వద్ద ముహూర్తపు రాట వేసిన ఎమ్మెల్యే

**పాడేరు,పెన్ పవర్, ఏప్రిల్ 13:**ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మోదకొండమ్మ అమ్మవారి మహోత్సవాలకు ముహూర్తం ఖరారైంది. మే 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు అతి వైభవంగా జరగనున్న పండుగ సందర్భంగా ఆదివారం పందిరి రాట కార్యక్రమం ఘనంగా జరిగింది.

శాసన సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మరియు ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళా తాళాలు, సంప్రదాయ నృత్యాలతో గ్రామ పురవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు.సతకంపట్టు వద్ద అర్చకుల వేదమంత్రాల నడుమ ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, భక్తుల సమక్షంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు చేతుల మీదుగా ముహూర్తపు పందిరి రాట వేసి ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు పలాసి క్రిష్ణ రావు, కిల్లో గంగన్న పడాల్, కొట్ట గుల్లి సుబ్బా రావు, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్య దొర, వంతినిభ రాజబాబు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు మఠం శాంతి కుమారి, కోశాధికారి మత్స్యరాస కిషోర్ కుమార్ రాజు, జీకే వీధి జడ్పీటీసీ కిముడు శివరత్నం, ఎంపీటీసీ గంగపుజారి శివ కుమార్‌తో పాటు ఓం శాంతి భక్తులు, ఆలయ-ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అమ్మవారి భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

